

కనువిందు.. నృత్య ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం చెన్నైకి చెందిన కళాకారులు విశ్వశిఖర నాట్యాలయ మీనా, కృష్ణప్రియ శిష్యబృందం భరతనాట్య అలరించింది. ఇందులో పుష్పాంజలి, గణేశ కీర్తనం, చంద్రచూడ, దేవికొత్వం, మాడు మొకుమ్ కన్నా, పరమ పురుషుడ, కళింగ నర్తన తిల్లాన, అదిగో అల్లదిగో, శివతాండవం, విష్ణుకొత్వం, దశావతారం తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు శ్రీనిధి, సుప్రజ, ధృతి, వర్ష, దేశికశ్రీ, రిషిక, నిరుపమ, ఐశ్వర్య, లోగిత, హరిణి పాల్గొన్నారు.

సెల్ థెరపీతో దెబ్బతిన్న అవయవాల పునరుద్ధరణ

బయో రీజనరేటివ్ ప్రిసిషన్ మెడిసిన్ సెమినార్‌లో డాక్టర్ మైక్‌చాన్

హఫీజ్‌పేట్: శరీరంలో దెబ్బతిన్న అవయవాలు, కణజాలాన్ని అధునాతన సాంకేతికతతో పునరుద్ధరించవచ్చని యురోపియన్ వెల్‌నెస్ బయోమెడికల్ గ్రూప్ ఫౌండర్ డాక్టర్ మైక్‌చాన్ అన్నారు. పాడైన అవయవాలను సైతం తిరిగి పనిచేసేలా సెల్ థెరపీ ప్రభావవంతంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని లీ మెరీడియన్‌లో జరిగిన బయో రీజనరేటివ్ ప్రిసిషన్ మెడిసిన్ సెమినార్‌లో మైక్‌చాన్ మాట్లాడారు. ప్రపంచంలో ఎంతోమంది అవయవాల వైఫల్యంతో మృత్యువాత పడుతున్నారని, అటువంటివారికి పూర్తిస్థాయిలో నయం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ సెల్ థెరపీ(ఐఏసీటీ) మానవున్ని యవ్వనంగా మార్చేందుకు పనిచేస్తుందన్నారు. సెల్‌థెరపీతో నాల్గవ దశ క్యాన్సర్‌ను కూడా ఎదుర్కోవచ్చని తెలిపారు. ఈ సేవలను ఆన్‌లైన్‌లో మాత్రమే అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం ఈడబ్ల్యూబీజీ లూప్‌వెబ్ అప్లికేషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సైంటిస్ట్ అల్లం రవి, ప్రముఖులు, యువ వైద్యులు పాల్గొన్నారు.



సదస్సులో ఈడబ్ల్యూబీజీ లూప్ వెబ్ అప్లికేషన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి వెన్నుముక అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గస్థాయి కృతజ్ఞత సభ, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయం కోసం కార్యకర్తలు కృషి చేశారని తెలిపారు. హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు వాటి అమలులో ఘోరంగా విఫలమయిందని విమర్శించారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, సీనియర్ నాయకులు శంకర్ యాదవ్ తదితరులు ప్రసంగించారు.ఈ సమావేశంలో ఎంపీపీలు దేవానందం ,ప్రవీణ, జెడ్పిటీసీలు సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, కార్పొరేటర్లు మెట్టుకుమార్ యాదవ్, సింధు ఆదర్శరెడ్డి, పుష్పా నగేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులను రక్షించుకుందాం..



తెల్లాపూర్‌లో మేళ్ల చెరువు పరిసరాలను శుభ్రం చేస్తున్న నైబర్‌హుడ్ సభ్యులు



శుభ్రపడిన చెరువు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చెరువులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెల్లాపూర్ నైబర్‌హూడ్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర గారి రమణ అన్నారు. ఆదివారం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవ్ లేక్స్ ,సేవ్ వాటర్ కార్యక్రమంలో భాగంగా తెల్లాపూర్ మేళ్ల చెరువు పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువుల పరిరక్షణకు నైబర్‌హూడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయా కాలనీవాసులతో కలసి గ్రీన్ ఆర్మీ గ్రూపును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి ఆదివారం తెల్లాపూర్ పరిధిలోని చెరువుల పరిసరాలను శుభ్రం చేస్తామన్నారు. కార్యక్రమంలో అందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 50 మంది వివిధ కాలనీలవాసులు, తెల్లాపూర్ వాసులు పాల్గొన్నట్లు తెలిపారు. తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో భారీగా చేరిన వర్షపు నీరు



వర్షం.. రోడ్లు జలమయం

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి రోడ్లు చెరువులను తలపించాయి. రోడ్డు పక్కన ఉన్న షాపుల్లోకి వర్షపు నీరు చేరటంతో ఇబ్బందులు పడ్డారు. అలాగే రాకపోకలు నిలిచిపోయాయి. కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో వర్షపు నీరు చేరి చెరువును తలపించింది. –మూసాపేట



కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద పెట్రోల్ బంక్ ఏరియాలో నిలిచిన వర్షపు నీరు



అగ్రగామి.. ఎన్‌వీఎస్ హైదరాబాద్

దేశ వ్యాప్తంగా 8 నవోదయ విద్యాలయ సమితి రీజియన్లలో టాప్



గోపన్‌పల్లిలోని నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ కార్యాలయం

రాయదుర్గం: సీబీఎస్ఈ 2023–24 విద్యాసంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయాలు తమ సత్తా చాటాయి. అందులో హైదరాబాద్ రీజియన్ పరిధిలోని జవహర్ నవోదయ విద్యాలయాలు దేశంలోనే మొదటి స్థానంలో నిలువడం విశేషం. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన, ఇంగ్లిష్ మీడియంలో విద్యను అందించాలనే తపనతో ఏర్పాటు చేసిన నవహర్ నవోదయ విద్యాలయాలు ఫలితాల్లో టాప్‌లో నిలుస్తున్నాయి. అందులో భాగంగా గత ఏడాది కూడా 10,12 తరగతుల ఫలితాల్లో దేశంలో టాప్‌లో నిలిచి వరుసగా రెండవ ఏడాది కూడా అత్యుత్తమ రీజియన్‌గా నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్) హైదరాబాద్ రీజియన్ గుర్తింపును సాధించడం విశేషం. దేశంలోని జేఎన్‌వీలను పర్యవేక్షించడానికి ఏర్పాటు చేసిందే ఎన్‌వీఎస్ సంస్థ. హైదరాబాద్ రీజియన్ కేంద్ర కార్యాలయాన్ని శేరిలింగంపల్లి పరిధి గోపన్‌పల్లిలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన భవనాన్ని రెండేళ్ల క్రితం నిర్మించారు.

- టెన్త్‌లో.. 77 జేఎన్‌విలలో 75 జేఎన్‌వీలు 100 శాతం ఉత్తీర్ణత
- 12వ తరగతిలో 73 జేఎన్‌విలో 72 జేఎన్‌వీలు 100 శాతం

- దేశంలో 8 రీజియన్లలో 649 జేఎన్‌వీలు
- దేశంలోని 27 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలలో 649 జవహర్ నవోదయ విద్యాయాలు ఉన్నాయి.
- జేఎన్‌విలను పర్యవేక్షించడానికి కేంద్ర ప్రభుత్వంలోని విద్యాశాఖ ద్వారా ఏర్పాటు చేసిన నవోదయ విద్యాలయ సమితి పని చేస్తుంది.
- దేశంలోని 649 జేఎన్‌విలను 8 రీజియన్లుగా విభజించారు. అందులో హైదరాబాద్, భోపాల్, చండీఘడ్, జైపూర్, లక్నో, పాట్నా, పూణె, షిల్లాంగ్ ఏర్పాటు చేశారు. ఈ 8 హైదరాబాద్ రీజియన్ పరిధిలో 77 జవహర్ నవోదయ విద్యాలయాలు ఉన్నాయి.

హైదరాబాద్ రీజియన్‌లో..

	జేఎన్‌వీలు	100 శాతం
పదవ తరగతి...	7 జేఎన్‌విలు..	75 జేఎన్‌వీలు
12వ తరగతి...	73 జేఎన్‌వీలు..	72 జేఎన్‌వీలు

విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యం



జవహర్ నవోదయ విద్యాలయాల్లో చేరిన ప్రతి విద్యార్థిని సంపూర్ణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌విఎస్) పనిచేస్తోంది. కేవలం అకడమిక్‌గానే కాకుండా క్రీడలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, సాంస్కృతిక రంగాలలో కూడా విద్యార్థులు రాణించేలా చక్కని ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నాం. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన సీబీఎస్ఈ విద్యను అన్ని అధునాతన సౌకర్యాలతో కూడిన విద్యాలయాల్లో అందించేలా జేఎన్‌వీలను రూపొందించాం. ప్రస్తుతం వరుసగా రెండవ ఏడాది కూడా హైదరాబాద్ రీజియన్ దేశంలోనే 10,12 తరగతుల ఫలితాలలో దేశంలో టాప్‌గా నిలిచింది. మరిన్ని ప్రణాళికలతో ముందుకుసాగుతాం.

– గోపాలకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్, ఎన్‌వీఎస్ హైదరాబాద్ రీజియన్, గోపన్‌పల్లి

ఆటమ్ సెలూన్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: అధునాతన సాంకేతిక పద్ధతులతో హెయిర్ బ్యూటీ, నెయిల్ సర్వీసులను అందిస్తున్న ఆటమ్ సెలూన్‌ను చందానగర్‌లో ఆదివారం ప్రారంభించారు. ఈ సెలూన్‌ను శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్‌గౌడ్, ఆటమ్ సెలూన్ బిజినెస్ హెడ్ శ్రీధర్ బాబు కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కేశాలంకరణ, బ్రైడల్, నెయిల్ ఆర్ట్ వంటి వినూత్న సౌందర్య సేవలను ఫ్యాషన్ నిపుణులతో అందిస్తున్నామని తెలిపారు.

21న లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవం

కూకట్‌పల్లి: శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంతి సందర్భంగా శ్రీ లీలాద్రిక్షేత్ర లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆల్విన్‌కాలనీ తులసీనగర్‌లోని లీలాద్రిక్షేత్రంలో వేంచేసియున్న నృసింహ స్వామివారి కల్యాణోత్సవంను ఈ నెల 21 మంగళవారం నుంచి గురువారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్, చైర్మన్ మాధవరం కాంతారావు, ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. 21వ తేది ఉదయం 9 గంటలకు విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్షధారణ, శ్రీ సుదర్శన లక్ష్మీ నరసింహ మహాయాగం, సకల గ్రహ దోష నివృత్తికై వాస్తు దోష, సంతాన దోష అనారోగ్య దోషములు, వివాహాది సకల శుభములు చేకూరడానికి ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చునని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు మహిళలచే సామూహిక అష్టలక్ష్మీ గౌరీ మహా కుంకుమార్చన ఉంటుంది. మధ్యాహ్నం 1 గంటకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

శంషాబాద్ డిగ్రీ కాలేజీలో దోస్త్ రిజిస్ట్రేషన్

శంషాబాద్: పట్టణంలోని మినీస్టేడియంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. హిమబిందు తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దోస్త్ వెబ్‌సైట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజేంద్రనగర్ అని ఉంటుందన్నారు. బీఏ, బీఎస్సీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇతర వివరాలకు 9441956233,9494812040 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జులై 9న ఎల్లమ్మ కల్యాణం

సనత్‌నగర్: భక్తులచే విశేష పూజలు అందుకుంటున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణాన్ని జులై 9న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్ మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి ఆహ్వానించారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో ఆలయ చైర్మన్‌తో పాటు మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పుచ్చలపల్లిని ఆదర్శంగా తీసుకోవాలి



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సీపీఎం నాయకులు



సభలో మాట్లాడుతున్న రైతు సంఘం కార్యదర్శి సాగర్

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య

పటాన్‌చెరు టౌన్: భూమి కోసం,భుక్తి కోసం పోరాటం చేసిన నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య అన్నారు.పటాన్‌చెరులోని శ్రామిక భవన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోరాటంలో సుందరయ్య ఆదర్శప్రాయుడని,నేటి తరం ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు నాగేశ్వరరావు, పాండు రంగారెడ్డి, రామకృష్ణ, పెంటయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గచ్చిబౌలి: బ్రిటీష్ వారికి వ్యతిరేక ఉద్యమం పోరాటంలో పాల్గొన్నవారిలో సుందరయ్య ఒకరని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గచ్చిబౌలి కార్యదర్శి పి ప్రభాకర్ అధ్యక్షతన సుందరయ్య వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆర్ సాంబశివరావు, శ్రీనివాస్, శేరిలింగంపల్లి ఏరియా కన్వీనర్ శోభన్, కృష్ణ, రవీందర్, అనీల్, సిబ్బంది పాల్గొన్నారు.

కేబీఆర్ వద్ద వాకర్లకు ‘భౌభౌ’ల బెడద



కేబీఆర్ పార్కు ముందు వీధి కుక్కలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లో ప్రతిష్టాత్మక కేబీఆర్ జాతీయ వనం ముందు వీధి కుక్కల బెడద తీవ్రరూపం దాల్చింది. ఇక్కడ ప్రధాన గేటు ముందు పదికి పైగా వీధి కుక్కలు ఇటు వాకర్లకు, అటు సందర్శకులకు ఇబ్బందులు కలగజేస్తున్నాయి. అరుపులతో వాకర్లను బెదరకొడుతున్నాయి. కొత్తగా పార్కుకు వచ్చే సందర్శకులను ఈ కుక్కలు అరుస్తూ వెంటపడుతూ బెంబేలెత్తిస్తున్నాయి. పదుల సంఖ్యలో వీధి కుక్కలు కొన్నేళ్లుగా ఇక్కడ తిష్టవేసి అరుపులు, కేకలతో బెదరకొడుతున్నా సంబంధిత జీహెచ్ఎంసీ అధికారుల్లో చలనం కరువైంది. పార్కు ముందు, పార్కు లోపల, పార్కుకు రెండు వైపులా జీహెచ్ఎంసీ వాక్‌వేలో కుక్కల సంచారం భయాందోళనకు గురిచేస్తున్నాయి. కుక్కల బెడదపై వాకర్లు, సందర్శకులు, పాదచారులు ఎన్నోసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకుండాపోయింది. పార్కు పక్కన ఉన్న జీహెచ్ఎంసీ వాక్ వేలో, ఫుట్‌పాత్ పైన కొంతమంది తమ పెంపుడు కుక్కలను తీసుకువస్తూ వాకింగ్ చేస్తుంటారు. ఈ పెంపుడు కుక్కలను చూసిన వీధి కుక్కలు ఒకటిపై ఇంకొకటి అరుస్తూ శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నాయి. వీధి కుక్కలను తరలిస్తే జంతు ప్రేమికులు ఊరుకోవడం లేదంటూ జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు పేర్కొంటున్నారు. ఇక్కడి నుంచి కుక్కలను తీసుకెళ్లడానికి పలుమార్లు డాగ్ క్యాచెస్ రాగా వారిపై జంతు ప్రేమికులు తిరగబడ్డారు.జీహెచ్ఎంసీ కమిషనర్ స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మోతీనగర్ మెయిన్‌రోడ్డు సమీపంలో రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు, మురుగు

మోతీనగర్: వర్షం పడితే చాలు ఆ ప్రాంతం చెరువును తలపిస్తోంది. మూసాపేట డివిజన్ మోతీనగర్ మెయిన్‌రోడ్డు సమీపంలో ఈ పరిస్థితి నెలకొంది. వర్షపు నీటికి తోడు అక్కడ ఉన్న అపార్టుమెంట్ నుంచి డ్రైనేజీ నీరు రోడ్డుపైకి వస్తున్నాయి. ఇక్కడ డ్రైనేజీ నీరు నిల్వ ఉండటంతో ఈ ప్రాంతం దుర్వాసన వెదజల్లుతోంది. కాగా ఈ రోడ్డు గుండా ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా ఆ రోడ్డు ఎత్తుపల్లాలుగా ఉండటంతో వర్షపు నీరు ప్రవహించకుండా నిల్వ ఉండటంతో వాగును తలపిస్తోంది. పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఎప్పుడు వర్షం కురిసినా ఈ ప్రాంతంలో వర్షం నీరు నిల్వ ఉంటోంది. సమీపంలో పాఠశాల, దుకాణాలు ఉండటంతో ఈ మార్గంలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని సమీప నివాసితులు కోరుతున్నారు.

సమాచారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు బయలుదేరు రైళ్ల వివరాలు

- 4.40 అమరావతి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి–విజయవాడ
- 6.15 జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి –వైజాగ్
- 12.25 దేవగిరి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి– సీఎస్ఎంటీ (ముంబాయి)
- 18.25 నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – తిరుపతి
- 18.30 కోకనాడ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – కాకినాడ (సోమ, బుధ, శుక్ర)

(19.00 మంగళ, గురు, శని)

- 20.30 గౌతమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి–కాకినాడ
- 21.05 నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి–నర్సాపూర్
- 21.40 హంసఫర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి–ఇండోర్ (ఆదివారం)

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



హఫీజ్‌పేట్: ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని ఆదివారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కొరకు శ్రమించిన పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యం గౌడ్, శ్రీనివాస్ నాయుడు, మంగలి కృష్ణ, ప్రభాకర్, బాలాచారి, సుభద్ర, కృష్ణచారి తదితరులు పాల్గొన్నారు.

‘మనూ’లో అడ్మిషన్ల ప్రక్రియ షురూ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఉర్దూ విభాగంలో పలు కోర్సులకు అడ్మిషన్ల పక్రియ ప్రారంభించినట్లు ఉర్దూ విభాగాధిపతి ప్రొఫెసర్ షంషుల్ హోడా ఆదివారం తెలిపారు. కొత్త విద్యాసంవత్సరానికి ఉర్దూ(ఎంఏ)లో 2024–25 అడ్మిషన్లు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఉర్దూ భాష లేదా మాధ్యమంతో యూజీలో ఏదైనా గ్రాడ్యుయేట్‌లకు ఈ కోర్సుకు అర్హులుగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మనూ హైదరాబాద్ క్యాంపస్‌లో 50 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారం, ఇతర వివరాలు అందుబాటులో ఉన్నాయని, ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9494440782లో సంప్రదించాలని ఆయన కోరారు.

వైభవంగా బాల మురుగన్ విగ్రహ ప్రతిష్ఠ



జీడిమెట్ల: బాల మురుగన్ కుమారస్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని తమిళ అసోసియేషన్ అధ్యక్షుడు పి.కొట్టాయి స్వామి అన్నారు. జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ వద్ద నూతనంగా నిర్మించిన బాల మురుగన్ కుమారస్వామి దేవాలయంలో ఆదివారం అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. గత మూడు రోజులుగా దేవాలయంలో హోమాలు, పూజలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొదటిరోజు స్వామివారి ఊరేగింపు, రెండవరోజు ప్రత్యేక హోమాలు, మూడవరోజు విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్‌లో ఉన్న తమిళులతో పాటు ప్రజలు ,వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఆర్.గణేషన్, జనరల్ సెక్రటరీ కె.చిన్నస్వామి, ట్రెజరర్ టి.భాస్కర్, జాయింట్ సెక్రటరీ టి.ఆనందం తదితరులు పాల్గొన్నారు.

నెలల తరబడి మురుగు సమస్య



శ్రీనివాసనగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏరులై పారుతోందని, దుర్వాసనతో బాటు ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు వాపోయారు. నెలల తరబడి రహదారులపై మురుగునీరు పారుతుండటంతో నడవలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని సమస్య గురించి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిత్యం ప్రమాదాలే..



రోడ్డు మధ్యలో దిగబడిన వాహనాన్ని తీస్తున్న క్రేన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ నుంచి ఉస్మాన్‌నగర్‌కు వెళ్లే మార్గం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ మార్గంలో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతోంది. ఈ రోడ్డు అసంపూర్తిగా ఉండడం రోడ్డు మధ్యలో పైపులైన్‌ల కోసం గుంతలు తవ్వి సరైన మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడినపుడు భారీ వాహనాలు గుంతలలో దిగబడిపోతున్నాయి. అధికారులు స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

యూత్ కాంగ్రెస్ ప్రొటోకాల్ చైర్మన్‌కు సన్మానం

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ యూత్ కాంగ్రెస్ ప్రొటోకాల్ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ ఆదిత్యరెడ్డి ఆదివారం పటాన్‌చెరుకు రాగా పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి, సన్మానించారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు . కార్యక్రమంలో ఐఎన్‌టియుసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అతిక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్యరెడ్డిని సన్మానించిన పార్టీ నాయకులు